# మేడ్ ఇన్ హెవెన్

- తెన్నేటి సుధ

వినూత్న మనస్సు దూది పింజెలా తేలిపోతోంది. కొద్ది గంటల క్రితమే తనకు భర్తగా తన జీవితంలోకి అడుగు పెట్టిన ప్రశాంత్‌ని మళ్ళీ మళ్ళీ చూడాలని ఉంది అతనితో జీవితం పంచుకోబోతోంది. కష్టాలు, సుఖాలు అన్నీ కలబోసుకుని తాను అతనికి అర్పించుకునే పవిత్రమైన, పవిత్రమైన భార్యాభర్తల అనుబంధాన్ని తలుచుకుంటున్న కొద్దీ వినూత్న హృదయంలో అందమైన అనుభూతులు రెక్కలు విప్పుకుని ఉత్సాహంగా గగన విహారం చేస్తున్నాయి.

ఇంత కొద్ది సమయంలో ఆమె మనస్సుని అంతగా ఆక్రమించగలిగిన ప్రశాంత్‌లో అద్వితీయమైన ఆకర్షణ ఉంది. నిష్కల్మష మూర్తి మత్వం, వినయ సంపన్నత, పాలరాతి విగ్రహంలా మెరిసే చక్కటి తెలుపు, ఇంజనీరింగ్ చదువు, బ్రహ్మాండమైన ఉద్యోగం - ఏ ఆడపిల్ల కలలు గనే అన్ని లక్షణాలూ ఉన్న ప్రశాంత్‌లో పెళ్ళిలో చూసిన వాళ్ళంతా తెగ మెచ్చుకుని పడ్డారు వినూత్న, ప్రశాంత్‌ల జంటను చూసి, ఒక్కమాటలో చెప్పాలంటే వినూత్న మెరుపు తీగలా, కుందనపుబొమ్మలా ఉంటుంది.

తలవంచుకుని కలల్లో తేలిపోతున్న వినూత్న, దగ్గరగా వినవచ్చిన అడుగుల సవ్వడికి ఉలిక్కిపడి తలెత్తి చూసింది. చిరునవ్వుతో తనకు అతి సమీపంగా నుంచున్న తన భర్త - తడబడ్తూ లేచి నుంచుంది. ప్రశాంత్ కళ్ళు వినూత్న సోయగాలు చూస్తూ మై మరచే దశలో ఉన్నాయి.

వినూత్న మనస్సు శరీరం ఉద్విగ్నంగా ఉన్న ఆమె భుజం మీద చేయివేసి ఆమె తలను తన దగ్గరగా తీసుకున్నాడు ప్రశాంత. వినూత్నకు మరో లోకంలోకి ఓ స్వర్గంలోకి వెళ్ళినట్లుంది. రెండు నిమిషాలు పారవశ్యంగా కళ్ళు మూసుకుంగి

"వినూత్నా! నీలాంటి అందాల రాశి నా సొత్తు కావడం నా అదృష్టం మన దాంపత్యం జీవితాంతం ఇట్లా అదృష్టనావలో పయనించాలి.......... నాతో సహకరిస్తావు కదూ!........" వినూత్న కళ్ళల్లోకి చూస్తూ అన్న ఆ మాటలకు ఆమె సిగ్గుల మొగ్గే అయింది. చిరునవ్వుతో పెదవులు విచ్చుకున్నాయి.

ఆమెను అతను మరింత దగ్గరకు గుండెలకు అదుముకున్నాడు. అతని శరీరంపై బాగాన కప్పుకున్న సిల్కు కండువా జారిపోయి అనాచ్ఛాదితంగా ఉన్న హృదయాన్ని చూసింది వినూత్న. ఆ తరవాత తనని పొదివి పట్టుకున్న కుడిచేయి సరే, ఎడమ చేయి ఏదీ? మోచేతి వద్దనుంచి పీలగా ఉంది. ఆమె మొహం వెల వెలబోయింది.

ఒక్కసారి దిగ్భ్రాంతిగా అతన్నుంచి తొలిగిపోయింది వినూత్న. అంతకు ముందు ఆనందం నిండుకున్న ముఖం కందిపోయింది. కళ్ళల్లో నీళ్ళు సుళ్ళు తిరిగినై.

ఆమె ప్రవర్తనకు స్థాణువై పోయాడు



ప్రశాంత్, ఆందోళనగా అడిగాడు, "ఏమైంది వినూత్నా?"

"ఛీ! నన్ను ముట్టుకోకండి. ఆ చెయ్యి చూస్తూ భరించలేను. వద్దు......... నాకీ జీవితం వద్దు........" మొహం చేతుల్తో కప్పుకుని ఏడ్తున్న వినూత్నను ఎట్లా సముదాయించాలో, అసలీ ప్రళయం ఎట్లా వచ్చిందో అర్థంగాక తెల్లబోయి "వినూత్న! ఏమిటిది? నాకు అర్థమయ్యేట్లు చెప్పు.......నేనంటే నీకు ఇష్టం లేదా?" ప్రశ్నించాడు మళ్ళీ..........

"ఇష్టంలేదు...... ఇష్టంలేదు - ఇష్టంలేదు. నేను నీతో కాపురం చెయ్యను" పిచ్చి పట్టినట్లు అరిచి హఠాత్తుగా లేచి గదితలుపులు తెరుచుకుని బయటికి వెళ్ళిపోయింది వినూత్న.

ఆనందం, అనుభూతులు కలబోసుకుని జీవితంలో మధురస్మృతి కావలసిన ఆరోజు హఠాత్తుగా జరిగిన ఈ సంఘటన పాలగిన్నెలో చిందిన విషంలా విలయం సృష్టించి విశ్రాంతి తీసుకుంది.

"ఎందుకు నువ్వీ నిర్ణయం తీసుకున్నావు వినూత్నా! నీకు తొందర పాటు తగదు... మరొక్క సారి ఆలోచించు" - వినూత్న తండ్రి ప్రసాదరావు కూతురి భవిష్యత్తు అర్థం గాక నచ్చచెప్పే ప్రయత్నం చేస్తున్నాడు.

"వద్దు నాన్న! నేను కన్నకలలకీ, ఈ జీవితానికీ సంబంధం లేదు. కానీ కారణాలు అడగొద్దు. నేనతనితో కాపురం చెయ్యను.........

"ఈ మాట అప్పటికి ఎన్నిసార్లు చెప్పిందో............ ఎంతచెప్పినా, ఎంత సముదాయించినా ఎవరు నచ్చచెప్పినా అందులో మార్పులేదు.

ప్రశాంత్ వినూత్నను కలుసుకుని ఒంటరిగా మాట్లాడాలని చాలా ప్రయత్నించాడు, కానీ వినూత్న ఆ అవకాశం ఇవ్వలేదు. ప్రశాంత్‌కి చెయ్యి లేదని అని పెళ్ళిచూపుల నాడే తెలుసు. అయితే ఫుల్‌హ్యాండ్స్ షర్ట్ వేసుకుంటాడు కాబట్టి అప్పుడు తెలియలేదు - చెయ్యి చూపించబోతే వినూత్న తండ్రి వారించాడు అవసరం లేదని, ఆ విషయం వినూత్నకూ తెలుసు - తెలిసినా ఒప్పుకుంది. కానీ తీరా ఎదురైన సత్యాన్ని తట్టుకోలేక పోయిందా! - ఏమైనా కలిసి కాపురం చెయ్యాల్సిన జంట మొదట్లోనే దూరమై పోయింది.

ఎంత ప్రయత్నించినా వినూత్నను

మర్చిపోలేక పోతున్నాడు ప్రశాంత్ 'ఎందుకల్లా జరిగింది! నిమిషాల మీద విషాదం అలుముకున్న తన జీవితానికి ఇప్పుడు పరిష్కారమేమిటి? కాపురం చెయ్యకపోయినా వినూత్న అతనిమనసంతా ఆవరించింది.

ప్రశాంత్ తల్లి వనజమ్మ కంటి ఆలు ఆరడంలేదు. లక్షల్లో ఒక్కడికి మాత్రమే ఉండే గొప్ప వ్యక్తిత్వం ప్రశాంత్‌ది. ఆ ఒక్క లోపం లేకపోతే పరిపూర్ణుడనే అనుకోవచ్చు - నెమ్మది, నీతి, నిజాయితే, మంచితనం, డబ్బు, ఉద్యోగం! 'ఇంతమంచి భర్తను వదిలేసి నందుకు వినూత్న పశ్చాత్తాప పడాల్సిందే అనుకుంటుంది.

పెళ్ళి చూపులప్పుడు చూడక పోవచ్చు కానీ తాళికట్టేటపుడూ దృష్టిలోకి రాలేదా? ఆ చేయి కూడా పూర్తిగా పనిచేయని చెయ్యికాదు. చేస్తుంది. తాళికట్ట గలిగాడు కదా! మామూలప్పుడు అందరి దృష్టి పడకుండా చేతిమీద ఆచ్ఛాదన ఉంచుతాడు వనజ నిట్టూర్చింది.

"అమ్మా" ప్రశాంత్ పిల్చాడు.

"ఏమిట్రా" అంది ఆర్ద్రంగా వనజ.

"నేను అమెరికాలో చదువు కోవాలనుకుంటున్నాను"

ఉలిక్కి పడింది తల్లి, కానీ ఆలోచిస్తే అదే నయమనిపించింది. తర్జన భర్జనలు జరిగిన



తరవాత ప్రశాంత్ అమెరికా వెళ్ళే ఏర్పాట్లల్లో మునిగిపోయాడు.

కాలంలో క్షణాలు లీనమవుతున్నై, అంతులేకుండా. ఆగని కాలం పరుగులు పెడుతోంది. న్యూయార్క్‌లో ఉద్యోగంలో స్థిరపడిపోయిన ప్రశాంత్ రెండు నెలలు సెలవులో వచ్చాడు. తల్లిని చూడాలని - గత సంవత్సరమే తండ్రి గతించాడు.

వినూత్న ఏంచేస్తోందో, ఎక్కడుందో - ఈ ఏడేళ్ల కాలంలో అసలేమీ తెలియదు. తెలుసుకోవాలని ప్రయత్నించలేదు కూడా. అట్లాగని వినూత్నను మరవలేదు, ప్రశాంత్ గతం గురించి ఆలోచిస్తూ ఉదాసీనంగా కూర్చున్నాడు. కార్లో వెనకవైపు ఆ ఊళ్ళోనే ఉన్న మేనత్తను చూసి ఇంటికి వస్తున్నాడు.

హఠాత్తుగా ఎదురుగా ఉన్న ఒక యువతి మీద దృష్టిపడింది, ఉలిక్కిపడ్డాడు.

ఎవరది? వినూత్నా!

కళ్ళునులుముకుని మరీ చూశాడు.

అవును సందేహం లేదు, తనే!

కానీ అదేమిటి?..........

తన ఆలోచనల్లో ఆమెను దాటి చాలా ముందుకు వెళ్లింది కారు. డ్రైవర్ని కారు రివర్స్ తీసుకుమన్నాడు. నడిచి వెళ్తున్న ఆమె పక్కన కారు ఆగింది.

తలెత్తి చూసింది వినూత్న, కార్లోంచి తననే చూస్తున్న ప్రశాంత్, కళ్ళు విప్పార్చి నిశ్చేష్టురాలై చూస్తుండి పోయింది. ఒక్క నిమిషం తరవాత తలవంచుకుని నడవడం మొదలెట్టింది.

"వినూత్న ఆగు" కారు తలుపుతీసుకుని గబగబా ఆమెతో నడిచాడు. ఆమె చెయ్యిపట్టుకుని!

"వినూత్నా! నన్ను మర్చిపోయినావా? ప్రశాంత్‌ని..."అన్నాడు భుజంమీద చెయ్యివేసి.

"మర్చిపోవడమా? ఒకదేవుణ్ణి మర్చిపోవడం సాధ్యమవుతుందా?........"మొహంచేత్తో కప్పుకుంది వినూత్న. మళ్లీ అంది, " నాలాంటి దానికి తగిన శిక్ష ఎక్కడో కాదు, ఇక్కడే పడింది........... ఆ శిక్ష ఆనందంగా అనుభవిస్తున్నాను. నన్ను వెళ్ళనివ్వండి" అంది భుజంమీద అతని చెయ్యి తీసివేస్తూ.

"లేదు వినూత్న! ఎప్పటికైనా నువ్వు నా భార్యవే.... "అన్నాడు ప్రశాంత్ ఆర్ద్రంగా.

'నేనా! ఆ అర్హత లేదు. మీ పక్కన నిలబడే అర్హత అసలు లేదు - ' వినూత్న కన్నీళ్ళు సెలయేరులా ప్రవహిస్తున్నాయి.

చేయూతగా ఉన్న కర్రను తీసుకుని ఆమెను కార్లో కూర్చోబెట్టాడు. ఆమె పక్కన తనూ కూర్చున్నాడు కారు కదిలింది. 'ఈ ప్రమాదం, ఎప్పుడు, ఎట్లా జరిగింది వినూత్న." ప్రశ్నించాడు ప్రశాంత్.

"సంవత్సరం కిందట జరిగిన ఒక బస్‌యాక్సిడెంట్‌లో ఈ కాలు మోకాలుదాకా విరిగిపోయింది...వెక్కిళ్ళ మధ్య అంది వినూత్న. "కృత్రిమమైన జైపూర్ కాలు పెట్టించుకుంటే ఏ లోటూ తెలియదు. నువ్వు ఏడవకూడదు. ఇది భగవత్సంకల్పం "ఆమె తలమీద చెయ్యివేసి నిమురుతూ అన్నాడు ప్రశాంత్.

అతని మహోన్నత వ్యక్తిత్వం ముందు తానో అల్ప జీవిలా కుంచించుకు పోతూ, ఆరాధనల మధ్య అదో కలలా అతని వైపు చూస్తుండి పోయింది వినూత్న.

## ఉగాది శుభాకాంక్షలు

మనసుల్లో దాగియున్న
మంచుతెరలు తొలగాలని
హృదయంలో అభిమానపు
పేరులు ప్రవిహించాలని
ఒకరిపైన ఒకరికున్న
కల్మషాలు కరగాలని
ఆకసాన శాంతి రేఖ
అద్భుతమై వెలగాలని
శాంతిరాజ్య స్థాపనలో
సర్వదిశలు సాగాలని
ఇంటా బయటా మదిలో
స్నేహం చిగురించాలని
ఆకాంక్షిస్తూ - అభిలషిస్తూ
అమెరికాలోని తెలుగువారికి నా
ఉగాది శుభాకాంక్షలు.

— శేషం సుప్రసన్నాచార్యులు
*Husnabad, AP*

## మహాబలిపురం

కళామతల్లికి పల్లవులర్పించిన మణిహారం
శిల్ప సంపద అలరారు నేటి మహాబలిపురం
పచ్చల పతకం లాంటిదే తీరదేవళ గోపురం
శిథిలం చేస్తోందికదాదాన్ని పక్కనున్న సాగరం

— శ్రీనివాస్
*Hyderabad, AP*